# జీవనధ్వని

గీ. "అకట! యీమందిరంబు శూన్యంబుచేసి అక్కటికమేది దీపంబు నార్పివైచి
భవనమునసుండునట్టి యాపరమహంస యేదెసకుఁబోయెనో కనరాదిదేమి ?"

—వేంకట పార్వతీశ్వర కవులు.

సాయంత్రం ఆరుగంటలను ఆరంభించి ఊళ్లో ఉన్న ప్రతిడాక్టరిల్లూ తిరిగితిరిగి పదుకొండుగంటలకు స్వగృహం చేరుకున్నాడు.

సింహాచలం సహజంగా కృశశరీరుడైనా తగిన పోషణలేక కండలుకదలిన శరీరముతో లోతుపోయిన కళ్ళతో లొత్తపడిన దవడలతో చిందరవందరైన క్రాపింగుతో చిరిగిపేలికలై మలినములైన గుడ్డలతో వెఱ్ఱివానివలె కనబడతాడు.

ఏడాక్టరునడిగినా పదిరూపాయిలమందులు కొనమనడమే. అతనివద్ద పదిరూపాయిలుకాదు పదిదమ్మిడీలుకూడా లేవు.

తిరిగితిరిగి యింటికివచ్చి గోనెపట్టిన వాలుకుర్చీలో కూలబడ్డాడు. కుర్చీకి ఎదురుగా నులకమంచంమీద చింపిబొంతలో ఇరవైఅయిదేండ్ల వయస్సుగల స్త్రీ స్పృహతప్పి పండుకున్నది.

ఆమె శ్వాస కఠినమై, సన్నని విపరీతస్వరంతో, గురుకుతో గుండెకాయను తుళ్ళిస్తూ పైకివస్తూంది. కళ్ళు అరవిచ్చిఉన్నాయి, మొగము పాలిపోయి కళావిహీనమైపోయింది. ఆమెప్రక్క మూడుదినములు వయస్సుగల చంటిపాపఉంది. దిగువ చింకిచాపమీద పదకొండు, ఎనిమిది, మూడుసంవత్సరముల వయస్సుగల పిల్లలు గాఢనిద్రలో ఉన్నారు.

ఎనిమిదేళ్ళ వయస్సుకలది ఆడపిల్ల.

ఎదురుగా ఒక విరిగిపోయిన దేవదారుడొక్కుమీద పొగలుకక్కుతూ ఒక దీపంబుడ్డీ యెఱ్ఱగా వెలుగుతూంది. ఇల్లంతా విరజిమ్మబడిన గుడ్డపేలికలతోనూ, విరిగినపెట్టెలతోనూ, ఎండినఆకులతోనూ, బూజుతోనూ నిండిపోయింది.

సింహాచలం నుదుటిమీద చెయ్యిపెట్టుకొని కళ్ళు మూసుకొని కుర్చీలో ఆలాగే ఉండి ఉండి లేచి మెల్లిగా మంచందగ్గిరకివచ్చి "పిల్లా, పిల్లా" అని మెల్లిగాపిలిచేడు. ఆస్త్రీ పలకలేదు—చూడలేదు. ఆమె ప్రక్కనున్న చంటిపాపను అటూఇటూ కదిలించి చూచేడు. పిల్ల కఱ్ఱకట్టిపోయింది. సింహాచలందూరంగా ఒక చింకిగుడ్డపరిచి ఆపిల్ల నక్కడపడవేసి, మళ్ళా మంచందగ్గిరికి వచ్చి "పిల్లా, పిల్లా" అని మెల్లిగాపిలిచి "చంటిపిల్ల చచ్చిపోయిందిలే, ఏడుపు" అన్నాడు. ఆమె కదలలేదు—చూడలేదు. శ్వాసమాత్రం సముద్రపుహోరులాగ వినబడుతూంది. గుండె పెద్దకెరటంలాగ కొట్టుకుంటూంది. సింహాచలం అటూఇటూచూచేడు.

దీపం కాంతివిహీనమై ఆరిపోవడానికి సిద్ధంగా ఉంది. గభీమనిలేచి మూడేళ్ళబాలునికోసం జాగ్రత పెట్టిన పాలగళాసు తొందరలో తన్నివేసినాడు. ఆ పాలు తుళ్ళి నిద్దరపోతూన్న ఎనిమిదేండ్లపిల్లపై బడినవి. ఆపిల్లలేచి ఏడుస్తూ కడమపిల్లల్ని లేపినది. ఇంతలో దీపం ఆరిపోయింది. ఇల్లంతాచీకటి, ఒక్కపెట్టున పిల్లలంతా గొల్లుమని లేచారు. సింహాచలం గుడ్డివానివలె అటూఇటూ తిరుగుతూ జేబులోవున్న అగ్గిపెట్టెతీసి దీపం వెలిగించేడు. కిరసనూనెకోసం ఇల్లంతా వెతికేడు. సీసాలో నూనెలేదు. మూడేళ్ళపిల్లడు గుక్కతిప్పకుండా ఏడుస్తున్నాడు. సింహాచలంబాలుణ్ణి ఊరుకోపెట్టడానికి ప్రయత్నించేడు. ఆకలిబాధచేత పిల్లడు ఏడుపుమానడు. రమారమి ఒంటిగంటకావచ్చింది. బాలుడు మరిఏడవలేక పండుకున్నాడు.

సింహాచలం మళ్ళా మంచందగ్గిరకివచ్చి "పిల్లా, పిల్లా పలకవూ, ఇటుచూడు" అన్నాడు. అతని ఎఱ్ఱ

నివిశాలనేత్రాలనుండి మూడు బాష్పబిందువులు రాలినవి. ఆమె పలకలేదు—చూపలేదు. శ్వాస మునుపటి కన్న ఎక్కువగా తోచింది.

సింహాచలం మళ్ళా కుర్చీలో కూలబడి డాక్టర్ల జవాబులు తలంచుకుంటున్నాడు. ఆర్తులపట్ల వాళ్ళ ప్రవర్తన పాపభూయిష్టమైన దనుకున్నాడు. ఆతురతతో వచ్చిన నిరుపేదపట్ల వారు చూపించే అనాదరం దౌర్జన్యంగా భావించేడు. తనభార్య బ్రతుకదని నిరాశ చేసుకున్నాడు. పిల్లల్ని తలచుకొని కొంతసేపు ఏడిచాడు. —అనేకవిధాల విచారిస్తూ కళ్ళుమూసేడు.

తెల్లవారింది. అయిదుగంటలు కావచ్చింది, పిల్లలంతా లేచి తల్లిమంచంచుట్టూ చేరి "అమ్మా, అమ్మా" అని పిలిచేరు

ఆమె తెలివితెచ్చుకొని నీళ్ళిమ్మనిఅడిగింది. మంచంకింద గ్లాసులో నీళ్ళుతీసి నేనంటే నేనని పిల్లలందరూ పోయుంట్టి ఆనీరు కొంత ఆమెనోటిలోనూ కొంత ఆమె మొగంమీద పోసినారు.

ఆస్త్రీ హీనస్వరంతో కుర్చీలోపడివున్న సింహాచలాన్ని అస్థిమితములైన దృష్టులతో చూస్తూ "ఏమండీ! పక్కలో చంటిపిల్ల ఏదీ? బౌనా—ఏమండీ!"

సింహాచలం పలకలేదు—చూడలేదు.

ఆమె పెద్దవానినిపిలిచి "నాయనా నాన్నగారిని లేపు" అంది. ఆబాలుడు కుర్చీదగ్గరకువెళ్ళి తండ్రిగెడ్డాం పట్టుకొని "నాన్నా! నాన్నా! లేలే—పొద్దెక్కింది. చద్దిఅన్నంపెట్టూ."

అతడు కదలలేదు—చూడలేదు.

మళ్ళా బాలుడు "నాన్నా! అమ్మలెమ్మంటూంది. లేలే."

కదలలేదు—చూడలేదు.

"ఏమండీ! పలకరు." మంచంమీదనుండి స్త్రీ వికృతమైన కంఠస్వరంతో అరినపెదవులనుండి "ఏమండీ! పలకరు—పిల్లలు, పిల్లలు—లెండి—లెండి." అన్నది.

సింహాచలం చూడలేదు—కదలలేదు.

—మల్లాది వేంకటకృష్ణశర్మ.

# నేటి డిక్టేటర్ల అలవాటులు

నేడు లోకమున డిక్టేటర్ల సంఖ్య పెరుగుచున్నది. వారిచరిత్రలు అద్భుతములు వారిఅలవాట్లు విచిత్రములు. రష్యా డిక్టేటరు స్టాలిన్ జోళ్ళుతొడుక్కొని ఉండియే నిద్రపోవును. మాతృభాషలోనే మాటలాడును. అయితే పదములను నొక్కినొక్కి ఉచ్చరించును. నల్ల టిరొట్టె అనిన చెవికోసికొనును. బాగుగా ఉడకపెట్టబడిన గ్రుడ్లతోను, పలుచగా వండబడిన కోడిపిల్లమాంసపు పులుసుకూరతోను పచ్చిదోసకాయల ముక్కలు నంజుకొని భుజించును. తురుష్క ప్రజాస్వామిక ప్రభుత్వనియంతయగు కెమాల్ పాషా తాను బదులువ్రాయు ఉత్తరములన్నియు ఆంగ్లభాషలోనే వ్రాయును. వేచిన గొడ్డుమాంసమును ఇతరపదార్థములను కడుపునిండుగా తినినపిమ్మట అతడు ఒకకప్పు టర్కిష్ కాఫీని త్రాగును. చక్కగ నాట్యముచేయును. జాజ్ సంగీతమనిన చాల ప్రియముపడును. గృహమున కుటుంబవ్యక్తులనడుమ నున్నప్పుడే ఇటలీదేశపు నిరంకుశ ప్రభువు మందహాసమైన చేయును. అట్టి సమయములందే అతడు సంగీతముకూడ పాడును. అదివినినవారికి అతడు పుట్టుకతోడనే సంగీతపాఠకుడయ్యెనా అనునంతటి హాయిని, ఆనందమును కలిగించును. పులుసుకూరలమీద అతనికి మనస్సు హెచ్చు. పారశీకదేశపునిరంకుశప్రభువు రిజా పహ్లావీ మాంసముముట్టడు. శాకాహారములనే భుజించును. ఆటవస్తువులలో యుద్ధభటులను ఏర్పఱచుకొని వానితో తీఱికసమయములందెల్ల క్రీడావినోదముల జరుపుచుండును. జర్మనుదేశపుడిక్టేటరు హిట్లరుకు పందిమాంసము చాలఇష్టము. అందులో కనుబొమలదగ్గఱ ఉండే మెత్తటిమాంసము అనిన చెవికోసికొనును. మనము మామిడికాయలతో పచ్చడిపెట్టుకొనునట్లు జర్మను దేశస్థులు కాబేజీతో పచ్చడి పెట్టుకుందురు. దానికి జర్మనుభాషలో శేనర్ క్రాంట్ అని పేరు. పందిమాంసములో ఈ పచ్చడి నంజుకొనుట హిట్లరుకు పంచభక్ష్యపరమాన్నభోజనము. డ్రాయింగురూము డ్రస్సులో చాలసేపు ఉండుట హిట్లరుకు కిట్టదు.